క్లుప్తంగా

ప్రజా సమస్యలపై స్పందించాలి



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఈఓ పీఆర్డీ శ్రీనివాసరావు

కరప: గ్రామాల్లో ఏ సమస్యపైన అయినా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే, వాటి పరిష్కారానికి వెంటనే స్పందించాలని మండల ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమై వివిధ అంశాలపై సమీక్షించారు. అనుసరించాల్సిన విధి విధానాలను వివరించి, అవగాహన కల్పించారు. పందుల సమస్యపై పెంపకదారులను కల్సి గ్రామాల్లో తిరగకుండా కట్టడిచేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడిలేకుంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటిపన్ను వసూళ్లు నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పనిచేయాలని గ్రామ కార్యదర్శులను ఈఓ పీఆర్డీ కోరారు.

ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



ఇంటి పన్నుల వసూళ్లపై సిబ్బందితో మాట్లాడుతున్న ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ ఆంజనేయులు

కాకినాడ రూరల్: ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించామని ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని చీడిగ గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లపై గురువారం పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలో 76 శాతం ఇంటి పన్నులు వసూలు చేశామన్నారు. మిగిలిన 24 శాతం పన్నులు మార్చి నెలాఖరు నాటికి వసూలు చేసే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు తరచూ విజిట్ చేస్తూ పారిశుధ్య పనులపై క్లాప్ మిత్రలకు దిశా నిర్దేశం చేస్తున్నామన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్న సీడీపీఓ లక్ష్మి, సూపర్ వైజర్లు

కాకినాడ రూరల్: మండలంలోని పండూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. రూరల్ ప్రాజెక్టు పరిధిలో మిషన్ పోషన్ 2.0 అండ్ సాక్షం అంగన్‌వాడీ కార్యక్రమాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు నాణ్యమైన పోషకాహారం, నాణ్యమైన విద్యకు సంబంధించి మూడు రోజుల పాటు శిక్షణ తరగతులను జరగనున్నాయి. కార్యక్రమాన్ని సీడీపీఓ వై.లక్ష్మి ప్రారంభించారు. 123 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణలో పాల్గొనగా, సూపర్‌వైజర్లు పద్మశ్రీ, రాజేశ్వరి, మార్తమ్మ, సింహాచలం, అన్నపూర్ణ, విజయలక్ష్మి, గనిలక్ష్మి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

91వ సారి మాజీ సర్పంచ్ రక్తదానం



రక్తదానం చేస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గురువారం 91వ సారి రక్తదానం చేశారు. మండలం నడకుదురు గ్రామానికి చెందిన ఎ.రామయ్య విద్యుదాఘాతానికి గురై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతనికి రక్తం అత్యవసరమన్న సమాచారాన్ని అందుకున్న తాతీలు జీజీహెచ్‌లోని బ్లడ్‌బ్యాంకుకు వెళ్లి ఓ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. దాతకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. బాధితకుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్సిడీపై మినుములు, పెసలు

కొత్తపల్లి: రైతులకు అపరాల పంట కోసం సబ్సిడీపై మినుములు, పెసలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో 15 క్వింటాళ్ల వీబీఎస్–8 రకం మినుములు, 60 క్వింటాళ్ల విరాట్ రకం పెసలు అందుబాటులో ఉన్నాయన్నారు. 50 శాతం సబ్సిడీపై రైతులకు వీటిని అందిచడం జరుగుతుందన్నారు. కావాల్సిన రైతులు పొలానికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జెరాక్స్‌లతో గ్రామ సచివాలయ అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

అట్టహాసంగా వారాహి ఉత్సవాలు

వెయ్యి కలశాలతో మహిళల ప్రదర్శన

కాకినాడ రూరల్: మండలం కొవ్వూరులో కొలువైన వారాహి అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలు బుధవారం అర్ధరాత్రితో ముగిశాయి. తొలుత భువనేశ్వరి అమ్మవారి ఆలయం నుంచి వారాహి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు భారీ ఊరేగింపు, మేళతాళాలు, కోలాటం, తీన్మార్, చెన్నై చెండై వాయిద్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనల మధ్య ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి ఊరేగింపుతో వెయ్యి కల శాలతో మహిళలు గ్రామోత్సవం నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అభిషేకాలు, హోమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ మూడు రోజులు నిత్యం 10 వేలకు తక్కువ కాకుండా అన్న సమారాధన నిర్వహించారు. వారాహి అమ్మవారి శక్తి పీఠం నిర్వాహకురాలు వారాహి లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో కాలా చినసత్యనారాయణ, పెండెం సత్యనారాయణ తదితర కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కొవ్వూరులో వారాహి అమ్మవారు



వెయ్యి కలశాలతో మహిళల గ్రామోత్సవం



కొవ్వూరులో వారాహి అమ్మవారి సన్నిధిలో భక్తులు



ఉత్సవాల్లో మహిళల కోలాటం



బ్రాహ్మణ మహిళలకు భరోసాగా..



సౌగంధిక అవార్డుల కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

సౌగంధిక పురస్కారాల ప్రదానం

బోట్‌క్లబ్: బ్రాహ్మణ మహిళలు అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిపేందుకు సౌగంధికా బ్రాహ్మణ మహిళ మణిహారం కృషి చేస్తుందని సంస్థ అధ్యక్షురాలు బాలాంతరపు సుచిత్ర పేర్కొన్నారు. దంటు కళాక్షేత్రంలో సంస్థ ఆధ్వర్యంలో 2వ వార్షికోత్సవాన్ని మహా కుంభ పేరిట గురువారం నిర్వహించారు. సామాజికవేత్త నడింపల్లి యమున పటాక్స్, సంగీత విద్వాంసులు బాల సుబ్రహ్మణ్యేశ్వరశర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుచిత్ర మాట్లాడుతూ రెండేళ్లుగా కాకినాడ పరిసర ప్రాంతాలలో సామాజిక సేవా కార్యక్రమాలు, శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి సౌగంధికా అవార్డులు ప్రధాన చేయడమే కాకుండా, 300 మంది బ్రాహ్మణ మహిళలచే వరలక్ష్మి వ్రతం సందర్భంగా అష్టలక్ష్మి వైభవం నిర్వహించినట్లు చెప్పారు. సంస్థ గౌరవ అధ్యక్షురాలు మెట్ట రాధ మాట్లాడుతూ సౌగంధిక బ్రాహ్మణ మహిళ మణిహారం ఆధ్వర్యంలో భవిష్యత్తులో మహిళలను అన్ని రంగాల్లో ముందు నిలిపేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం పలువురికి సౌగంధిక అవార్డులు పంపిణీ చేశారు. సంస్థను అన్ని విధాలా ప్రోత్సహిస్తున్న మెట్టా వెంకటేష్, చిట్నీడి శ్రీనివాస్‌తో పాటు పలువురిని ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వారణాసి విజయలక్ష్మి, చావలి సూర్య కుమారి, ఆకెళ్ల పద్మ, వీరేశ్వరపు రాజి, దువ్వూరి శ్రీరామలక్ష్మి పాల్గొన్నారు.

పిండ దశ నుంచే పిల్లల అభ్యాసం

కాకినాడ క్రైం: పిల్లల అభ్యాసం పిండ దశ నుంచే ప్రారంభమవుతుందని ఐసీడీఎస్ కాకినాడ అర్బన్ ప్రాజెక్టు చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో) జ్యోతి అన్నారు. శ్రవణం, స్పందన తల్లి గర్భం నుంచే మొదలవుతాయన్నారు. కాకినాడలోని స్థానిక ముత్తానగర్ మున్సిపల్ హైస్కూల్‌లో «పోషణ్ భీ పడాయి భీ» పేరుతో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల శిక్షణ ప్రారంభమైంది. ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి పర్యవేక్షణలో సీడీపీఓ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణకు 85 మంది అంగన్వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. సీడీపీవో జ్యోతి మాట్లాడుతూ తొలి రోజు ప్రారంభ సంవత్సరాల విద్య, ప్రీ స్కూల్ చైల్డ్ లక్షణాలు, అభివృద్ధి అవసరాలు, సమగ్ర అభివృద్ధి డొమైన్లు, పిల్లలను ఆకర్షించే వాతావరణాన్ని సిద్ధం చేయడం, స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో బొమ్మలు తయారు చేయడం, మెమెరీ గేమ్స్ అంశాలపై శిక్షణనిచ్చామన్నారు. సెక్టార్ సూపర్‌వైజర్లు ప్రభావతి, దయామణి, అరుణశ్రీలు బోధకులుగా వ్యవహరించారని తెలిపారు. శనివారం వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయన్నారు.



శిక్షణనిస్తున్న సీడీపీవో, సూపర్‌వైజర్లు

నాగార్జున చెరువులో చేపల వేట వద్దు

- నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి
- కమిషనర్‌కు కౌన్సిలర్ వినతి
- నేటి నుంచి చేపల వేట నిషేధం

సామర్లకోట: అధికారులు ప్రకటించిన నిబంధనల ప్రకారం నాగార్జున తాగునీటి చెరువులో చేపల వేటను నిషేధించాలని కౌన్సిలర్ నేతల హరిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఈనెల 15లోగా చేపల వేటను పూర్తి చేయాలని మత్స్యకారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కాగా 20వ తేదీన కూడా వేట సాగిస్తున్నారని హరిబాబు ఆరోపించారు. ఏప్రిల్ మొదటి వారంలో గోదావరి కాలువ కట్టి వేసే అవకాశం ఉన్నందున నాగార్జున చెరువులో నీటిని పూర్తిగా తొలగించి కొత్త నీటితో నింపాలన్నారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం నాటికి చేపల వేటను ముగించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. చెరువులో నీటిని తొలగిస్తున్నామని చెప్పారు. అల్లూరి సీతారామరాజు పార్కు చుట్టూ ఆక్రమణలు పెరిగిపోతున్నాయని వాటిని తొలగించాలని నేతల హరిబాబు మరో వినతి పత్రం అందజేశారు. ఆక్రమణల తొలగింపుకు టీపీఓకు లిఖిత పూర్వకంగా లేఖ ఇచ్చినట్టు తెలిపారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతల హరిబాబు

పీఎండీఎస్ విత్తనాలతో నేల సారవంతం

కరప: రబీ కోతలకు ముందు పీఎండీఎస్ (ప్రీ మాన్‌సూన్ డ్రై సోవింగ్) విత్తనాలు చల్లడం వల్ల నేల సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసా యం జిల్లా పాజెక్ట్ మేనేజర్ ఏలియాజర్ అన్నా రు. మండలం కొంగోడులోని ప్రకృతి వ్యవసా యం యూనిట్‌ను గురువారం ఆయన పరిశీలించి, రైతులు, సిబ్బందితో మాట్లాడారు. జిల్లా ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది ఎంటీ ధనలక్ష్మి, డివిజన్ మెంటల్ అర్జున్‌కుమార్ పాల్గొన్నారు.



కొంగోడులో పీఎండీఎస్ విత్తనాల కిట్లను పరిశీలిస్తున్న డీపీఎం ఏలియాజర్

ఉద్యోగ భద్రత కల్పించాలి



ధర్నా చేస్తున్న విద్యుత్ మీటర్ రీడర్లు

బోట్‌క్లబ్: ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు ఇవ్వాలని విద్యుత్ మీటర్ రీడర్లు జిల్లా సంఘం ఆధ్వర్యంలో స్థానిక కాకినాడ కుళాయి విద్యుత్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేశారు. సంఘ నాయకులు తెలుగు తల్లి విగ్రహం నుంచి భారీ ర్యాలీగా ఎలక్ట్రికల్ ఎస్ఈ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులు బీఎస్ రావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకుని చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రభుత్వం తమకు మరింత అన్యాయం చేస్తుందని వాపోయారు. టెక్నాలజీకి మేము అడ్డుకాదని, మాకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఎం, డిప్యూటీ సీఎంలకు వినతిపత్రాలు సమర్పించినట్లు వారు తెలిపారు. కానీ ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. ఈ ధర్నాలో కాకినాడ డివిజన్ నాయకులు ఎం.వీరబాబు, డీఎస్ఎస్ రెడ్డి, ఎస్.కె మదీనా, కుమార్, నూకరాజు, రామకృష్ణ, మాధవ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే కేసీబీఎస్ ప్రగతి

బోట్‌క్లబ్: ఖాతాదారుల తోడ్పాటు, ఉద్యోగుల సమష్టి కృషితోనే ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సంస్థ వందేళ్లకు పైగా సమర్థవంతమైన సేవలు అందిస్తోందని చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. స్థానిక సినిమా రోడ్‌లోని కేవీకే రావు ఆడిటోరియంలో గురువారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి, డైరెక్టర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మేనేజర్ చీమలకొండ గంగాధర్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనను సభ ముందు ఉంచారు. సభ్యుల ఆదాయ పన్ను సందేహాలను ఆడిటర్ నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కోసూరి మాట్లాడుతూ ఖాతాదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సొసైటీ ప్రగతిలో భాగస్వాములైన సభ్యుల వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా సంస్థ ప్రత్యేక దృష్టి సారించి ఉచిత వైద్య శిబిరాలతో పాటు మరెన్నో సేవా కార్యక్రమాలు అందిస్తోందన్నారు. భవిష్యత్‌లో కూడా ఉద్యోగులు మరింత అంకితభావంతో పనిచేసి సంస్థ ప్రగతికి తోడ్పడాలని సూచించారు. సమావేశంలో కేసీబీఎస్ ప్రధాన కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు ముత్తా మధు, ఒబిలిశెట్టి బుచ్చిరాజు, శివ బాలయోగి, కోసూరి లక్ష్మీ ప్రసాద లావణ్య, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



కేసీబీఎస్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణమూర్తి

నిరుపేదలకు రంజాన్ కానుక



నిరుపేదలకు రంజాన్ కానుక అందిస్తున్న జాజుద్దీన్

బోట్‌క్లబ్: రంజాన్ పండుగను నిరుపేదలు ఆనందంగా జరుపుకోవాలని వారికి నిత్యవసర వస్తువులు అందిస్తున్నట్లు స్థానిక జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు ఎస్‌ఏ జాజుద్దీన్ అన్నారు. గురువారం జామియా మసీద్ ఆవరణలో 500 మంది నిరుపేదలకు రంజాన్ కానుక అందించారు. మసీద్‌లో ఏర్పాటు చేసిన హుండీ ద్వారా వచ్చిన ఆదాయంతో ఏటా రంజాన్ నెలలో నిరుపేదలకు రంజాన్ కానుక అందిస్తున్నామన్నారు. మసీద్ కమిటీ సభ్యులు షమ్ము జుబేర్, ఉబేదుల్లా, సలీంబాయి, తానీషా, అజ్జు, ఇంతియాజ్, బాషా పాల్గొన్నారు.

27న మండల పరిషత్ ప్రత్యేక సమావేశం

కాకినాడ రూరల్: మండల పరిషత్ ప్రత్యేక సమావేశం ఈ నెల 27న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.సతీష్ తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీ అయిన పదవులకు ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల కమిషన్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఎంపీపీ పదవి ఖాళీగా ఉండడంతో ఎన్నిక నిర్వహించేందుకు ఎంపీటీసీ సభ్యులకు ఎన్నికల గెజిట్ అధికారి ఈ మేరకు నోటీసు ఇచ్చినట్టు గురువారం ఆయన తెలియజేశారు.

అంగన్‌వాడీల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరప: అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు నాణ్యమైన విద్యనందించేందుకు, పోషకాహారం ఎలా అందించాన్నదానిపై ఇస్తున్న శిక్షణను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు కె.అన్నపూర్ణ, కె.విజయలక్ష్మి, వై.శ్రీనివాస్ పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో వారు మాట్లాడారు.

సామాజిక భవన నిర్మాణానికి రూ.40 లక్షలు



రూ.40లక్షల చెక్కును అందజేస్తున్న కోరమండల్ సంస్థ ఎండీ శంకర సుబ్రహ్మణ్యం

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడి బీసీ కాలనీ పరిధిలో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవన నిర్మాణానికి కోరమండల్ సంస్థ ముందుకు వచ్చింది. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ తన సీఎస్సార్ నిధులు రూ.40 లక్షలను ఇందు కోసం కేటాయించింది. వాకలపూడిలోని కోరమాండల్ ప్లాంట్ అడ్మిన్ భవనంలో గురువారం ఈ మేరకు చెక్కును జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ్‌కు సంస్థ ఎండీ ఎస్.శంకర సుబ్రహ్మణ్యం చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, హెచ్ఆర్ హెడ్ పద్మనాభం, సీఎస్సార్ విభాగం ఇన్‌చార్జి వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బయో ఫ్యూయల్స్ వితరణ



రూ. 36.85 లక్షల చెక్కును కలెక్టర్ షణ్మోహన్‌కు అందజేస్తున్న దుగ్గల్

కాకినాడ సిటీ: గ్రామీణాభివృద్ధి పథకం, ఆరోగ్య ప్రమాణాలు పెంచడంలో సామాజక బాధ్యత కింద యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ చైర్మన్, ఎండీ సంజీవ్ కుమార్ దుగ్గల్ రూ.36.85 లక్షల చెక్కును కలెక్టర్ షణ్మోహన్ సగిలికి గురువారం అందజేశారు. సూర్యారావుపేటలోని తాగునీటి ఫిల్టర్ మార్చడానికి రూ.20 లక్షలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో న్యూరాలజీ విభాగం షెడ్ నిర్మాణానికి రూ.16.85 లక్షలు అందజేసినట్టు దుగ్గల్ తెలిపారు. జేసీ రాహుల్ మీనా, ప్రణాళికాధికారి త్రినాథ్, యూనివర్సల్ బయో ఫ్యూయల్స్ జీఎం వసంతరావు, కన్సల్టెంట్ డాక్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కరప: భర్త వేధింపులు తాళలేక గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత కాకినాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలం పెద్దాపురప్పాడు శివారు వై.సావరం గ్రామానికి చెందిన కోరం రాజశేఖర్‌తో తాళ్లరేవు మండలం సీతారామపురానికి చెందిన సాధన (28)కు 8 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వివాహం జరిగినప్పటి నుంచి సాధనను అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న రాత్రి 8.30 గంటల సమయంలో భార్యా భర్తలు గొడవపడ్డారు. ఆ గొడవలో సాధనను రాజశేఖర్ చస్తే చావు అన్నాడు. దీంతో ఆమె ఇంటిలో ఉన్న గడ్డిమందు తాగేసింది. ఆమెను చికిత్స కోసం కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు గురువారం ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెగా జాబ్ డ్రైవ్‌లో 129 మందికి ఉద్యోగాలు

కాకినాడ సిటీ: కాకినాడ అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ డ్రైవ్‌లో 129 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.అనంతలక్ష్మి తెలిపారు. డ్రైవ్‌లో జేకేసీ కో ఆర్డినేటర్ పి.సంజోత, హెచ్ఆర్ సిబ్బంది విజయలక్ష్మి, జి.రాజేష్, కె ఉదయ్‌శంకర్, బి సంతోష్, స్నేహలత, వైస్ ప్రిన్సిపాల్ మల్లెల సువర్చల, కో ఆర్డినేటర్ ఎం వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్పారో డే, ఫ్రాగ్ డే..

కళాశాల జువాలజీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ స్పారో డే, వరల్డ్ ఫ్రాగ్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి పర్యావరణంలో పిచుకలు, కప్పల పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐక్యూఏసి కో ఆర్డినేటర్ ఎం.వసంత లక్ష్మి, జంతుశాస్త్ర విభాగాధిపతి ఎస్.మాధవి తదితరులు పాల్గొన్నారు.